ప్రజాశక్తి
మంగళవారం 17 జూన్ 2025
5
పార్వతీపురం మన్యం

గుంతలో దిగి ఇద్దరు విద్యార్థులు మృతి

కురుపాం మండలం బొడ్డ మానుగూడ గ్రామంలో సోమవారం అదే గ్రామానికి చెందిన బిడ్డిక సునంద (12), మండంగి జెస్సిక (11)గ్రామ సమీపంలో ఉన్న ఇటుకలు తయారీ కోసం చేసిన గొయ్యిలో చేపల కోసం దిగి మృతి చెందారు. వీరిద్దరూ లంకాజోడు గిరిజన సంక్షేమ ... తరగతులు చదువుతున్నారు. వేసవి సెలవులకు వచ్చిన పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లేలోపే దారుణం చోటు చేసుకుందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

కుమార్తె మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

(వివరాలు మెయిన్‌పేజీలో)

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని

కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక- పార్వతీపురం టౌన్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం పథకం మున్సిపల్ కార్మికులను అనర్హులుగా గుర్తించడం అన్యాయమని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్లో డిఆర్ఒ కె.హేమలతకు, సిఐటియు నాయకులు, కార్మికులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం నిధులు జమ చేయకుండా కూటమి ప్రభుత్వం మోసగించిందని విమర్శించారు. పారిశుధ్య కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేస్తామని హామీలు ఇచ్చిందని, ఇంజినీరింగ్ కార్మికులు చాలీ చాలని వేతనాలతో బతుకుతున్న తమ కుటుంబాలకు కూడా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులతో పాటు స్కీం వర్కర్లందరికీ తల్లికి వందనంతో పాటు ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్.శంకర్రావు, సిహెచ్. సింహాచలం, ఎన్.మల్లేష్ బి.రాజేష్, ఎం.శివ, మాధవ, పాపమ్మ, ఇప్పలమ్మ, వసంత, భాగ్యలక్ష్మి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కలెక్టర్‌కు వినతి

సాలూరు : తల్లికి వందనం పథకాన్ని అట్టడుగున ఉన్న కాంట్రాక్ట్ మున్సిపల్ విభాగాల కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు కలెక్టర్‌కు ప్రతినిధి బృందం వినతిపత్రం అందించింది. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు విలేకరులతో మాట్లాడారు. తల్లికి వందనం పథకాన్ని మున్సిపల్ కార్మికుల పిల్లలకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అలాగే పురపాలక సంఘాల్లో ఇంజనీరింగ్ కార్మికులకు వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సాలూరు కమిటీ అధ్యక్షులు రాముడు, కార్యదర్శి శంకర్రావు, ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అమర్‌కుమార్, సంతోష్ ఉమా, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక నగర పంచాయతీలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ కార్మికులందరికీ షరతుల్లేకుండా తల్లికి వందనంతో పాటు మిగిలిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నగర పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ రత్నరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న విశిష్ట సేవలను పరిగణలోకి తీసుకొని షరతులు లేకుండా కార్మికులందరికీ తల్లికి వందనంతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.వేణు, సిహెచ్ సంజీవి, విమల, పి.అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.జ్యోతిలక్ష్మి ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ సంక్షేమ పథకాలు లేకుండా చేయడం దుర్మార్గమని చెప్పారు. అంగన్వాడీ కార్యకర్తలకు నెలకు రూ.11వేలు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు నెలకు రూ.7వేలు వేతనం చెల్లిస్తున్నారని చెప్పారు. కనీస వేతనం రూ.26వేలు కూడా లేని అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వ ఉద్యోగులు ఎలా అవుతారని ప్రశ్నించారు. అంగన్వాడీలందరికీ తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, అలాంటప్పుడు తల్లికి వందనం పథకం కింద ఎందుకు నగదు బదిలీ చేయలేదని నిలదీశారు. గతంలో అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్వో కెహేమలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబానికి అందని 'తల్లికి వందనం'

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన నాయకుడు మాలతీ దొర పరిచయం అక్కరలేని టిడిపి నాయకుడు. సాలూరు మండలంలోని కొదమ గిరిజన ప్రాంతంలో పట్టున్న నాయకుడిగా గుర్తింపు ఉంది. మాలతీదొర తల్లి చోడిపిల్లి బందో మండల పరిషత్ వైస్ ఎంపిపిగా పని చేశారు. ఆయన తల్లి వైస్ ఎంపిపి అయినా మాలతీదొరే ఆ పదవిలో ఉన్నట్లు వ్యవహరించారు. కొదమ ప్రాంత గిరిజనుల తలలో నాలుకలా పని చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణితో సత్సంబంధాలు ఉన్నాయి. అలాంటి కుటుంబం ఇప్పుడు ప్రభుత్వ సంక్షేమ సాయం కోసం ఎదురు చూస్తోంది. మాలతీదొర కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణంతో కుటుంబం అనాథైన పరిస్థితి ఏర్పడింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య జట్టమ్మ కూలి పనులు చేస్తూ పిల్లలను చదివిస్తోంది. పెద్ద కూతురు మండంగి లలిత పదోతరగతి, చిన్న కూతురు లక్ష్మీ ఆరో తరగతి, కొడుకు మణి కుమార్ మూడో తరగతి చదువుతున్నారు. వీరు ముగ్గురూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. మాలతీదొర కుటుంబం పార్వతీపురం మండలంలోని డోకిశిల పంచాయతీ జోగిదొర, మెట్టవలసలో నివసిస్తున్నారు. ముగ్గురు పిల్లలకు అమ్మకు వందనం పథకం కింద డబ్బులు పడతాయని ఆశించారు. కానీ మాలతీదొర భార్య జట్టమ్మ ఖాతాలో అమ్మకు వందనం డబ్బులు జమ కాకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. దీంతో మాలతీ దొర భార్య జట్టమ్మ సహా ముగ్గురు పిల్లలు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు అమ్మకు వందనం పథకం కింద సాయం చేయాలని వారు కోరుతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు గ్రీవెన్స్ వచ్చిన బాధిత గిరిజనులు

షైనింగ్ స్టార్స్ చెక్కుల్లో సమస్యల్లేవు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

షైనింగ్ స్టార్స్ చెక్కుల్లో సమస్యల్లేవనికలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. 95 మంది పదో తరగతి విద్యార్థులు షైనింగ్ స్టార్ కార్యక్రమంలో చెక్కులు పొందగా వారిలో 72 మందికి ఇప్పటికే సర్దుబాటు చేశామన్నారు. మిగిలిన వారు బ్యాంకుల్లో తమ చెక్కులను డిపాజిట్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాల్లేని మారుమూల, దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు నేరుగా చెల్లించే ఏర్పాట్లు కూడా చేశామని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఇటీవల మారడంతో ఆయన స్పెసిమన్ సిగ్నేచర్ సమస్య ఈనెల 11 వరకు ఉండేదని, అనంతరం సమస్య పరిష్కారమైందని తెలిపారు. ప్రస్తుతం చెక్కుల నగదు జమలో ఎటువంటి సమస్య లేదని ఆయన తెలిపారు బ్యాంకుల్లో సమస్య తలెత్తితే డిఆర్ఒ (8333813248), జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ (9121386194) ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. షైనింగ్ స్టార్ చెక్కుల విషయంలో ఎటువంటి ఆందోళన అవసరం లేదని అన్ని అంశాలు సానుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు.

చెక్కుల సమస్య లేదు : డిఇఒ

షైనింగ్ స్టార్స్ అవార్డు కింద పంపిణీ చేసిన చెక్కుల్లో ఎలాంటి సమస్య లేదని జిల్లా విద్యాశాఖ అధికారి రాజ్ కుమార్ చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 9న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్స్‌కు రూ.20వేలు చొప్పున చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అయితే అంతకుముందు రెండు రోజులు వరుసగా సెలవులు కావడంతో చెక్కుల జారీలో కొన్ని పొరపాట్లు జరిగాయని చెప్పారు. ఇంఛార్జి డిఇఒగా ఉన్న తనకు 12న పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారని, వెంటనే పంపిణీ చేసిన చెక్కులు సెంట్రల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ల్లో చెల్లుబాటయ్యేలా చర్యలు చేపట్టామని తెలిపారు. 72 మంది చెక్కులు చెల్లుబాటయ్యాయని చెప్పారు. ఎంఇఒ పేరుతో ఇచ్చిన 29 చెక్కులకు నగదు డ్రా చేసి లబ్దిదారులకు అందజేసినట్లు డిఇఒ చెప్పారు.

రోగులతో ఏరియా ఆస్పత్రి కిటకిట

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల కురిసిన వర్షాలకు తవడం వల్ల కొత్త నీరు కలుషిత జలాలు తాగడం వల్ల ప్రతి ఇంట్లో జ్వరాలతో బాధపడుతున్నారు. మరోపక్క ఎండలు అదే స్థాయిలో ఉండడం మలేరియా వైరల్ జ్వరాలతో ఏజెన్సీను కుదిపేస్తుంది. సీతంపేట చిన్నకంబ, పెదకంబ, ఈతమానుగూడ, వలగజ్జి, తలెబుగూడ తదితర గ్రామాల్లో గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నారు. ఈమేరకు సోమవారరం స్థానిక ఏరియా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడింది. సీతంపేట ఏజెన్సీలోని అన్ని గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. ఏజెన్సీలో జ్వరాల తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు సకాలంలో అందించినప్పటికీ వర్షాలకు అదే స్థాయిలో జ్వరాలు కూడా విజృంభిస్తున్నాయి. సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఒపి 379 రాగా, అందులో మలేరియా21, వైరల్ జ్వరాలతో 81 బాధపడుతున్నట్లు సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు .

రోగులతో కిటకిటలాడుతున్న ఏరియా ఆస్పత్రి

పట్టణ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సిపిఎం నాయకులు వినతిని అందజేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను సిపిఎం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ లక్షలాది రూపాయలు ప్రజాధనంతో నిర్మించిన రైతు బజార్ను వెంటనే వాడుకులోకి తేవాలని, ప్రభుత్వ ఐటిఐ, గ్రంథాలయాలకు సొంత స్థలాలిచ్చి భవనాలు నిర్మించాలని, సాలూరుకు మంజూరైన గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. అలాగే పట్టణంలోని అన్ని కాలనీలకు రోడ్లు, కాలువలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని, సాలూరులో గిరిజన భవనానికి నిధులు కేటాయించి నిర్మించాలని, జిల్లాలో గల ఏకైక పరిశ్రమ జీగిరాం జూట్ మిల్లును వెంటనే తెరిపించాలి కోరారు. వినతిని అందజేసిన వారిలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు సంగీత, రాముడు, శంకర్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల పడిగాపులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సి పల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెతో పట్టణంలో గత ఎనిమిది రోజులుగా తాగునీరు సరఫరా జరగకపోవడం ప్రజలు తాగునీటికి నానా ఇబ్బందులు అవస్థలు పడుతున్నారు. ప్రత్యమ్నాయ దిశగా అదనపు ట్యాంకర్లను మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాటు చేయకుండా కార్యాలయంలో ఉన్న రెండు ట్యాంకర్లతో మాత్రమే తాగునీరు పట్టణంలో సరఫరా చేయడంతో నీరు పట్టుకునేందుకు మహిళలు నానా అవస్థలుపడుతున్నారు. ఎక్కువ సమయం బారులు తీరి వేచి ఉండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు కమిషనర్‌కు, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని తక్షణమే అధికారులు అదనపు ట్యాంకర్లను అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేసి తాగునీటి కష్టాలు తీర్చాలని పలు వార్డుల మహిళలు కోరుతున్నారు.

తాగునీటి కోసం ట్యాంకర్ వద్ద బారులు తీరిన మహిళలు

యోగాంధ్ర పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం పార్వతీపురంలో యోగాంధ్రలో భాగంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే పలు యోగాసనాలు, విద్యార్థులచే వేయించారు. విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాల మెరుగుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని ప్రిన్సిపల్ జె.రామారావు వివరించారు. ప్రతి విద్యార్థి యోగాపై కొంత సమయాన్ని కేటాయించాలని, దినచర్యగా పాటించాలని ప్రిన్సిపల్ కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆకుల రాజు, ఎన్ ఎస్సెస్ పిఒలు తెర్లి.రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, డిటి నాయుడు అధ్యాపకులు, ప్రదీప్, లక్ష్మణరావు, రామకృష్ణ, శ్యామలరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం: డిప్యూటీ డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వి.ఎస్ పద్మావతి ఆదేశించారు. మండలంలోని డోకిశీల పిహెచ్‌సిని సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఎనీమియా యాక్షన్ కమిటీ మీటింగ్ ప్రతినెలా మొదటి బుధవారం పిహెచ్‌సి పరిధిలో గల ప్రతి సచివాలయంలో తప్పనిసరిగా జరిగేలా చూడాలన్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేయాలని, అబా ఐడి క్రియేట్ చేయాలని ఆదేశించారు. నిర్దేశిత ఇండికేటర్లు అమలు పక్కాగా ఉండాలని ఆమె ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఫీవర్ సర్వే చేపట్టి జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం డికె పట్టణం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ ను సందర్శించి జననీ మిత్ర అప్లికేషన్ జరుగుతున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఐశ్వర్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ఎంఇఒ-1 డి.గౌరునాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు రిలీవింగ్, జాయినింగ్ ఆర్డర్ కాపీలు అందజేసిన సందర్భంగా మాట్లాడారు. అన్ని వృత్తిల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసే పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు.

పామాయిల్‌పై దిగుమతి సుంకం 50శాతానికి పెంచాలి

ప్రజాశక్తి - కొమరాడ

కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5శాతం నుంచి 16.5శాతానికి తగ్గించడం వల్ల ఆయిల్ పామ్ గెలల ధర పడిపోయి నష్టపోతున్నామంటూ ఆయిల్ పామ్ రైతుసంఘం అధ్యక్షులు బోళ్ల సత్యన్నారాయణ జనరల్ సెక్రటరీ శేఖర్ పాత్రుడు డిమాండ్ చేశారు. మండలంలోని మాదిలింగిలో పామాయిల్ రైతులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పామాయిల్ దిగుమతి సుంకం 50శాతానికి పెంచాలని, ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ఒక్కసారిగా ఆయిల్ పామ్ రైతులు కుదేలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు పామాయిల్ దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సుంకాలు ఎత్తివేయడంతో ఆయిల్ పామ్ గెలల ధరలు భారీగా పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. తిరిగి 27.5శాతం దిగుమతి సుంకం పెంచడం వల్ల ఆయిల్ పామ్ గెలలు ధర పెరిగిందన్నారు. దిగుమతి సుంకం తగ్గించడంతో గడిచిన నెలలో రూ.18,600కు ధర పడిపోయిందన్నారు. ఈ ధర మరో రూ.2వేలు తగ్గి సుమారు రూ.16 వేలకు ధర పడిపోనుందని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశం వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించకపోవడంతో ప్రతి ఏటా రూ.లక్షా 20వేల కోట్లకు పైగా విలువైన వంట నూనెలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. విదేశీ వంట నూనెల దిగుమతులు తగ్గించుకోవడం కోసం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించారని, దేశంలోనే అత్యధిక ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని, మన రాష్ట్రంలో విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో ద్వితీయ స్థానం లో ఉందని వివరించారు. రైతులే కాకుండా కూలీలు, కార్మికులు రాష్ట్రంలో 10 లక్షలకు పైగా కుటుంబాలు ఆయిల్ పామ్ సాగుపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. సాగు ఖర్చులు కంటే తక్కువ ధర రావడంతో గతంలో అనేక సందర్భాల్లో రైతులు తోటలు తొలగించుకున్నారని అన్నారు. ఎగుమతులు, దిగుమతులు విధానంలో తీసుకుంటున్న నిర్ణయాలకు రైతులు బలైపోతున్నారని విమర్శించారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్ దేశీయంగా రైతులకు శాపంగా మారిందన్నారు.పామాయిల్ దిగుమతులపై 50 శాతం వరకు సుంకం పెంచి ఆయిల్ పామ్ గెలల ధర పడిపోకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, అందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పచ్చి గెలల పేరుతో పక్వానికి వచ్చిన గెలలను గ్రేడింగ్ పేరుతో ఏరి వేయడం తక్షణం ఆపాలన్నారు. ఆయిల్ పామ్ రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారం చేసేలా చర్యలు చేపట్టాలని, ఆయా ఫ్యాక్టరీల పరిధిలో వస్తున్న సమస్యలపై జాయింట్ మీటింగ్స్ ఏర్పాటు చేసి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

లక్ష్యం కొండంత... నీరిచ్చేది గోరంత

- పూర్తి కాని జంఝావతి ప్రాజెక్టు
- అన్నదాతకు తప్పని సాగునీటి అవస్థలు

ప్రజాశక్తి - కొమరాడ

24,640 ఎకరాలకు సాగునీరందించేందుకు ఏర్పాటు చేసిన జంఝావతి ప్రాజెక్టు దిష్టిబొమ్మలా దర్శనమిస్తూ పంట పొలాలను ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన రైతన్న ఆశలు ఆడియాశలయ్యాయి. రబ్బర్ డ్యాము రెండు కాలువల ద్వారా 24,000 ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉన్నప్పటికీ అధికారి యంత్రాంగం విఫలమవుతుంది. ఈ ప్రాంతంతో పాటు పార్వతీపురం, సీతానగరం, ఐదు మండలాల్లో పంటపొలాలు సస్య శ్యామలంగా పండించేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఆదిశగా ప్రభుత్వాలు ప్రాజెక్టు పూర్తి చేయలేకపోవడంతో పాటు పూర్తిస్థాయిలో అవకాశం ఉన్న మేరకైనా సాగునీరందించే పరిస్థితి లేకపోవడంతో ఈ ప్రాంత రైతులు సాగునీటి కోసం ఎంతో ఆశగా ఎదురు చూడాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. జంఝావతి ప్రాజెక్టు పూర్తి కావాలంటే ఒడిశాతో ఉన్న వివాదం పరిష్కారమైతే 24,640 ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంది. ఆ ప్రాజెక్టు ఎలాగో ఆ ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో 2006లో ఏర్పాటు చేసిన రబ్బరు డ్యామ్ ద్వారా 24 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు ఏర్పాటు చేసినా కనీసం 25శాతం కూడా సాగునీరివ్వకపోవడంతో ఈ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హై లెవెల్ కాలువ ద్వారా 12 వేల ఎకరాలకు, లోలెవెల్ కాలువ ద్వారా 12 వేల ఎకరాలకు ఐదు మండలాలకు సాగునీరు అందించేందుకు కాలువలు ఏర్పాటు చేశారు. లోలెవెల్ కెనాల్ ద్వారా కొంతమేరకు సీతానగరం వరకు అంతంత మాత్రమే సాగునీరందుతుంది. హై లెవెల్ కెనాల్ ద్వారా నీరందించడంలో ప్రతి ఏటా అధికారులు విఫలమవుతున్నారు. ఒక ఏడాది విద్యుత్ మోటర్లు ద్వారా అందించగా, విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించలేక, మోటర్లు మరమ్మతులకు గురవ్వడంతో సాగునీరిందించడంలేదు. ప్రతి ఏటా హై లెవెల్ కెనాల్ ద్వారా పూర్తి స్థాయిలో సాగునీరిందించేందుకు డెంగభద్ర వద్ద ఉన్న సిల్ట్‌ను ఇప్పటికీ తొలగించలేదు. ఒక్కొక్క ఏడాది నీరిచ్చేందుకు అవకాశం ఉన్నా కనీసం ప్రాజెక్టు నుంచి హై లెవెల్ కెనాల్ ద్వారా కిలోమీటర్ దూరం కూడా నీరు వెళ్లడం లేదు. దీంతో విక్రాంపురం, శివిని, మరికి తదితర ప్రాంతాలకు సాగునీరందడం లేదు. లో లెవెల్ కెనాల ద్వారా కొమరాడ, పార్వతీపురం, సీతానగరం మండలం వరకు సాగునీరిందించే అవకాశం ఉన్నప్పటికీ కాలువలో పేరుకుపోయిన పూడికలు పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందడంలేదు.

నాగావళి నదికి ఉపనది అయిన జంఝావతి నదిపై నాటి విజయనగరం జిల్లా కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం వద్ద 1976లో రూ.13.50 కోట్లతో ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రస్తుత జిల్లా పరిధిలోని 5 మండలాల్లో గల 75 గ్రామాలకు చెందిన 24,640 ఎకరాల భూమికి రెండు ప్రధాన కాలువల ద్వారా ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేసేందుకు లక్ష్యాలు తీసుకున్నారు. ఎపి, ఒడిశా రాష్ట్రాల పరిధిలో 2,245 ఎకరాల భూమి ముంపునకు గురౌతుందని, ఈ ప్రాంతంలో మన రాష్ట్రానికి చెందిన భూసేకరణ పూర్తి అయినప్పటికీ, ఒడిశా ముంపు ప్రాంత భూసేకరణకు ఆ ప్రభుత్వం అప్పట్లో అభ్యంతరం తెలిపింది. దీంతో అప్పటి వరకు చేసిన పనులన్నీ వృధా అయిపోవడంతో రైతులు ఆశలన్నీ అడియాశలుగా మిగిలిపోయాయి. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వినూత్న ఆలోచనతో ఒడిశా భూభాగం ముంపునకు గురికాకుండా రబ్బర్ డాంగా ఒక చెక్ డ్యామ్‌ను ఏర్పాటు చేసి రెండు ప్రధాన కాలువల ద్వారా 24 వేల ఎకరాలకు ఒక్కొక్క కాలువ ద్వారా 12000 ఎకరాలకు నీరిందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ఆగ మేఘల మీద డ్యామ్ ప్రారంభించారు. ఒడిశా రాష్ట్రం నది పరివాహక ప్రాంతపు భూములు ముంపునకు గురికాకుండా రూ.5 కోట్ల వ్యయంతో 2006లో ఆస్ట్రియా సాంకేతిక పరిజ్ఞానం తో రబ్బరుడ్యాము‌ను నిర్మించి 125.500 మీటర్ల లెవల్ వరకు రిజర్వాయరులో నీటిని నిల్వచేసి 247 క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన స్కవర్ స్లూయిస్ గుండా లింకు కెనాల్ ద్వారా లోలెవెల్ కాలువకు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. 650 హార్స్ పవర్ గల 3 మోటర్లతో ఎత్తిపోతల పథకం ద్వారా 1-ఆర్ కాలువకు నీరు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా ఖరీఫ్‌లో లెవెల్ కాలువ, 1-ఆర్ కాలువల ద్వారా 9వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నా కేవలం 5వేల ఎకరాల్లోపే సాగునీరు అందుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి లోలెవెల్, హై లెవెల్ కెనాల్ ద్వారా 24000 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

జంఝావతి రబ్బరు డ్యామ్

నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరు

ప్రతి వారం పిజిఆర్ఎస్‌కు వచ్చే దరఖాస్తులకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్టు అధికారి కె.రామ చంద్రరావుతో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేగం, నాణ్యత, నిష్పక్షపాతంగా పిజిఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల సమస్యలను సావధానంగా విని పరిష్కరించే దిశలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి దరఖాస్తుదారునికి చట్టప్రకారం పరిష్కారం చూపించాలన్నారు. స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు రసీదు ఇవ్వడంతో పాటు సమస్య పరిష్కారానికి చివరి వరకు వేచి చూడకుండా గడువులోపే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా 154 దరఖాస్తులు వచ్చాయి.

స్వీకరించిన దరఖాస్తుల్లో కొన్ని....

సాలూరు మండలం గాంధీనగర్ లో నివాసముంటున్న తుపాకుల గణేష్ తనకు కొత్త రేషన్ కార్డును మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. సాలూరు పట్టణంలోని రాము కాలనీ 23వ వార్డ్ లో నివాసముంటున్న చిక్కాల జ్యోతి, గుణవతి తమకు కరెంట్ మీటర్ రీడింగ్ వల్ల తల్లికి వందనం పథక వర్తించలేదని సమస్యను పరిష్కరించాలని దరఖాస్తు చేశారు. 14వ వార్డు పరిధిలోని బంగారమ్మ కాలనీకి చెందిన ఎం.మాధవి, రాధ, ఎం.సౌజన్య, బి.స్వర్ణ లత, వరలక్ష్మి తదితరులు తమ కాలనీలో సగానికి పైగా ప్రజలు దారిద్ర్యరేఖ దిగువున నివసిస్తున్నారని, కాలనీలో ఉన్న స్నాక్స్ ఫ్యాక్టరీ వల్ల పొగ, కాలుష్యంతో అనారోగ్యం బారిన పడుతున్నామని దయచేసి ఫ్యాక్టరీని వేరే జన నివాసం లేని చోటుకు తరలించమని కోరుతూ దరఖాస్తు చేశారు. అలాగే 29వ వార్డుకు చెందిన మర్రి రవణమ్మ తనకు ఐదేళ్ల నుంచి రేషన్ కార్డు ఆపేశారని, తన భర్త కరోనాతో 2020లో మరణించారని, తనకు వితంతు పెన్షన్ కూడా రావడం లేదని, రేషన్ కార్డు, పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. సాలూరు పట్టణానికి చెందిన చల్లా సర్వేశ్వరరావు తన టిడ్కో ఇంటి కోసం మున్సిపల్ కమిషనర్ పేరు మీద రూ:50వేలు డిడి ఇచ్చామని, ఆ డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. సాలూరు ముండలం కూర్మరాజుపేటకు చెందిన కె.తవిటి నాయుడు, సిహెచ్.సింహాచలం లక్ష్మీ సాగరం చెరువు నుండి చిన్నవలస రోడ్డుకు లింకు రోడ్డు, మట్టి రోడ్డుకు గ్రావెల్, మెటల్ రోడ్డు వేస్తే, సుమారు 500 మంది రైతులకు సౌకర్యంగా ఉంటుందని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేశారు. మావుడి గ్రామానికి చెందిన వెంకటతిరుపతి రావు కందులపదం నుంచి మావుడి కి బిటి రోడ్డు వేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సాలూరు పట్టణం 21 వార్డు గొల్లవీధి నుండి జి.గుణవతి తనకు కరెంట్ బిల్లు కారణంగా తల్లికి వందనం పథకం అందలేదని పరిష్కారించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సమావేశంలో అన్ని శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

గ్రీవెన్స్ వివరాలు 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక వివరాలు 1100 నెంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించి సమాచారం తెలుసుకొనుటకు 1100కు నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

కలెక్టరేట్ పీజీఆర్ఎస్ కు 118 వినతులు

పార్వతీపురం : స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 118 వినతులు అందాయి. డిఆర్ఒ కె.హేమలత అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. వినతులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికార ప్రతినిధులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 60 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో సోమవారం పిజిఆర్ఎస్ ఎఒ సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 60 అర్జీలు వచ్చాయి. బైదిలాపురం చెందిన పోలయ్య ఆయిల్ ఇంజన్ మంజూరు చేయాలని విన్నవించారు. కోసమానుగూడ చెందిన బాలకృష్ణ ఎపిఆర్జెసిలో అటెండర్ పోస్ట్ ఇప్పించాలని విన్నవించారు. అచ్చుపువలసకు చెందిన శ్యామలరావు బ్యాంకు కోచింగ్‌కు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. పెద్ద తంకిడి చెందిన రమేష్ రచ్చబండ మంజూరు చేయాలని గ్రీవెన్స్ దృష్టికి తీసుకొచ్చారు. మార్తాపు రానికి చెందిన కిషోర్ బ్యాటరీస్ ఫెయిర్ మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో డిఇ సింహాచలం, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్, సూపరింటెండెంట్ అప్పారావు, ఎఎంఒ కోటిబాబు, జిసిటిఒ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో...

పార్వతీపురం రూరల్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎఎస్‌పి అంకిత సురాన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో 24 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ ఆదామ్, సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ నిర్మూలనకు చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గంగరేగు వలస పంచాయతీలో కేన్సర్ వ్యాధి నివారణకు చర్యలు చేపట్టి, కారణాలు తెలుసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిరా డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం నాయకులు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి కేన్సర్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం కేన్సర్ రోగులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంచాయతీలో అత్యధికంగా 12మంది వరకు కేన్సర్ బారిన పడి మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఇంకా మరో పదిమందికి పైగా వ్యాధిగ్రస్తులున్నారని అన్నారు. కేన్సర్ వ్యాధి బారిన పడిన వారు ఇప్పటికీ ప్రాణాలు కాపాడుకునేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వారి కుటుంబాల ఆర్థికంగా చితికిపోయాయి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ అధికారుల లెక్కలకు మాత్రం కేవలం ముగ్గురే కేన్సర్ రోగులు ఉన్నారని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. కేన్సర్ వ్యాప్తికి గల కారణాలను ప్రభుత్వం ఇప్పటికి గుర్తించకపోవడం దారుణం అన్నారు. ఈ వ్యాధికి గల కారణాలను ప్రభుత్వం తెలుసుకొని నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. స్థానిక ఎంపిటిసి సభ్యులు గంట వెంకటనాయుడు తమ గ్రామంలో కేన్సర్ వ్యాప్తిగల కారణాలు తెలుసుకొని బాధితులను ఆదుకోవాలనికోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, రైతులు ఉన్నారు.

యోగా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నేడు ఏనుగుకొండ వద్ద యోగాంధ్ర

ప్రజాశక్తి - మక్కువ

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంగళరాయ సాగరం వద్ద గల ఏనుగుకొండ దగ్గర యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సంబంధిత అధికారులతో యోగా కార్యక్రమం నిర్వహించే ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలోపెద్ద ఎత్తున చేపడుతున్నామని అన్నారు. పర్యాటక ప్రాంతాల్లో నిర్వహణలో భాగంగా ఇప్పటికే తోటపల్లి, సీతంపేట ప్రాంతాల్లో నిర్వహించామని, ఈ మేరకు మంగళవారం ఏనుగుకొండ దగ్గర యోగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములై జయప్రదం చేయాలని ఆయన కోరారు. గ్రామ స్థాయి నుంచి యోగ పోటీలు ప్రారంభం అయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -కురుపాం

మండల కేంద్రంలో నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి అధికారులతో ఆమె మాట్లాడుతూ పనుల్లో డొల్లతనం లేకుండా నాణ్యత తిలోదకాలకు పాటించాలని, అలాగే రహదారికి ఇరువైపులా కాలువలు కూడా సక్రమంగా నిర్మించాలని తెలిపారు. కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఆలయంలోకి, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లకు వర్షపు నీరు చేరిందన్నారు. కావున ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, ఆర్అండ్‌బి జెఇ సుశీల, ఇఒపిఆర్‌డి వై.వెంకట నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని పరుశురాంపురానికి చెందిన పూర్వ రైతు సంఘ నాయకులు బలగ అప్పలనాయుడు సతీమణి లక్ష్మీదేవి మృతి చెందడంతో సిపిఎం నాయకులు సోమవారం ఆమె కుమారుడు బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు నరసింగరావును పరామర్శించి సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, పట్టణ కార్యదర్శి దావాల రమణారావు, నాయకులు కె.రాము, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

చంద్రబాబు మోసాలపై వైసిపి పుస్తకం

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో లోపాలపై నియోజకవర్గ స్థాయిలో ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన క్యాంపు కార్యాలయంలో సోమవారం పుస్తకావిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజల కోసం బంగారు భవిష్యత్తు నిర్మిస్తే చంద్రబాబు పాలన వాటిని విధ్వంసం చేయడానికే పరిమితమైందని విమర్శించారు. ఏడాదిగా విధ్వంసకర పాలనకు ప్రతీకగా "వైయస్ జగన్ అంటే నమ్మకం - చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకం ద్వారా గడిచిన ఏడాది పాలనా కాలంలో రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి, ఆయన కుమారుడు లోకేష్ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో ఒక అరాచకాన్ని సష్టించారు అన్నారు. రాష్ట్రంలో ఏడాది కాలంగా వ్యవస్థల నిర్వీర్యం నుంచి ప్రజాస్వామ్య విధ్వంసం వరకు ఈ పుస్తకంలో ప్రతీ అంశం పొందుపరచడం జరిగింది అని తెలియజేశారు. కార్యక్రమంలో మూడు మండలాలు, పురపాలక సంఘం పార్టీ అధ్యక్షులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి అధికారికి వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

అద్దె బస్సు డ్రైవర్లకు ఒప్పందాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి ఎస్ ఆర్టీసీలో నిరంతరం శ్రమిస్తున్న అద్దె బస్సు డ్రైవర్లకు లేబర్ చట్టాల ప్రకారం వేతన ఒప్పందం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సమస్యలు పరిష్కారించాలని కోరుతూ డిపో మేనేజర్, డిపిటిఒలకు యూనియన్ డిమాండ్ల పత్రం అందజేశారు. ఎపిఎస్ ఆర్టీసీ హైయర్ బస్సు వర్కర్స్ యూనియన్ డిపో కమిటీ, సిఐటియు పార్వతీపురం జిల్లా కమిటీ నాయకులు, అద్దె బస్సు డ్రైవర్ల సంఘం అధ్యక్షులు కెవి చారి,సెక్రటరీ పిడి ప్రసాద్, కోశాధికారి ఎస్.మన్మధరావు, కోశాధికారి సి.అశోక్, శంకర్ సునీలు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ జిల్లా నాయకులు బివి రమణ నాయకత్వంలో జూన్ 10న యూనియన్ జనరల్ బాడీ నిర్వహించుకొని ఆర్టీసీ డిఎం, జిల్లా డిపిటిఒ పర్సనల్ ఇన్చార్జ్ ఎంఎ నాయుడు, సెక్యూరిటీ అధికారికి డిమాండ్ల పత్రం అందజేశారు. సంఘం నిర్ణయించుకున్న దానిలో భాగంగా సోమవారం నాయకులంతా చర్చించుకుని వెళ్లి డిమాండ్ల పత్రం సమర్పించారు. వారం రోజుల్లో చర్చించి డిమాండ్లు పరిష్కరించాలని కోరారు .లేనిచో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

తాబేలువలసలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కేసరజోడు పంచాయతీ తాబేలువలస లో నాలుగు ఏనుగులు సంచరిస్తు న్నాయి. గత రెండున్నరేళ్లుగా భామిని మండలం పరిసర ప్రాంతాల్లో సంచరించేవి. ప్రస్తుతం సీతంపేట మండలం తాబేలువలసలో ఏనుగులు సంచరించడంతో గిరిజనులు భయం ఆందోళన చెందుతున్నారు. కొండపోడుకు వెళ్లాలంటే బికిబిక్కుమంటున్నారు. రాత్రి వేళలో గ్రామాల్లో చొరబడతాయేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాబేలువలసలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

డిఏ జుగాకు స్పందన : కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరు

ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఎ జెజియుఎ) కార్యక్రమం జిల్లాలో బాగా జరుగుతుందని, గిరిజనుల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ నెల 15 నుంచి 30 వరకు డిఎ జుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగతిని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. అందులో భాగంగా గిరిజనుల అవసరాలను గుర్తించి ధ్రువపత్రాలను జారీ చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేసే ఈ కార్యక్రమంలో గిరిజన ప్రాంతాల్లో సేవలు, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయమని అన్నారు. గ్రామ/ క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా వివిధ సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో అందించేలా జిల్లా అధికారులు కషి చేయాలని ఆదేశించారు. వివిధ ధ్రువపత్రాల జారీతో పాటు పివిటిజి గృహాలు, గిరిజన గ్రామాలను గుర్తించడం, గ్రామ/ క్లస్టర్ స్థాయి శిబిరాలను నిర్వహించడం, ఆరోగ్యం, ఆహారం, పంచాయతీ రాజ్ గ్రామీణాభివద్ధి, సామాజిక న్యాయం, వ్యవసాయం, రెవెన్యూ ఇతర విభాగాల సమన్వయంతో కార్యకలాపాలు చేపట్టాలని అన్నారు. ఆధార్, ఇ - కెవైసి డాక్యుమెంటేషన్ సంబంధిత సేవల కోసం సంబంధిత విభాగాలు పనిచేస్తాయని స్పష్టం చేశారు. ఆధార్‌లో నమోదు కాని వారిని అంగన్వాడీ సిబ్బంది నమోదు చేయించాలని, గ్రామ స్థాయిలో ఈ కార్యక్రమం విజయవంతం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : పిఎం జుగా సర్వే ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందుతాయని ఐటిడిఎ పిఒ జి.చిన్నబాబు అన్నారు. మండలంలోని చాకలిగూడ పంచాయతీ గజిలిలో పీఎం జుగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ పిఎం జుగా సర్వే ద్వారా గుర్తించిన వివిధ రకాల ప్రజల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పీఎం జుగా ద్వారా అందే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇప్పటివరకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, హెల్త్ కార్డ్స్, బర్త్ సర్టిఫికెట్లు లేనివారు, అంతే కాకుండా గ్యాస్ కనెక్షన్ లేనివారు, బ్యాంకు అకౌంట్లు లేనివారికి పీఎం జుగా సర్వే ద్వారా ఆయా శాఖల వద్ద పొందవచ్చని అన్నారు. ఐటిడిఎ పరిధిలోని రెండు జిల్లాల్లో కలిపి 88 గ్రామాల్లో పీఎం జుగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ డిప్యూటీడిఇ జి.రామ్మోహన్ రావు, ఎంపిడిఒ మిశ్రో, ఇతర మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : సాచ్యురేషన్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు గుర్తించేందుకు ఈనెల 16 నుండి 30 వరకు మండలంలో గల పివిటిజి గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని స్థానిక ఎంపిడిఒ బివిజె పాత్రో సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గ్రామ సభల్లో అన్ని శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. ముఖ్యంగా ఈ గ్రామ సభల్లో రేషన్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు. ప్రభుత్వ పథకాలు మంజూరు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, సూక్ష్మ ప్రణాళిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు.

డిఆర్‌ఒకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

తాగునీటి సరఫరా మెరుగుపర్చాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం

మున్సిపాలిటీలో మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని, వారంలో ఒకరోజు కూడా మంచినీటి సరఫరా చేయలేని దుస్థితిలో పాలకవర్గం, ప్రభుత్వం ఉందని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ విమర్శించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి అనంతరం డిఆర్ఒ కె.హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 70 వేల మంది నివసిస్తున్న పార్వతీపురం మున్సిపాలిటీలో అనేక ఏళ్లుగా మంచి నీటి సరఫరా వ్యవస్థ ధ్వంసమైందని, దీన్ని మెరుగు పర్చాల్సిన పాలకవర్గం, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. పట్టణంలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గత ప్రభుత్వం రూ.67కోట్లు కేటాయించింది కానీ ఆ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో మంచినీటి సరఫరా సమస్య మొదటికొచ్చిందని అన్నారు. ఇప్పటికైనా పార్వతీపురం పట్టణంలో మంచినీటి సరఫరా మెరుగుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్య శాశ్వత పరిష్కారానికి తగు సూచనలకై రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులతో మున్సిపల్ యంత్రాంగం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. మంచినీటి సరఫరా మెరుగుపర్చకపోతే పెద్ద ఎత్తున మహిళలతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు బి.లక్ష్మి, జి.తులసి, గౌరమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కురుపాం

విఆర్ఎల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహశీల్దార్ ఎ.సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న విఆర్ఎలను విఆర్ఒలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, మహిళా విఆర్ఎలకు నైటీ డ్యూటీలో మినహాయించి, నామిని విఆర్ఎలను విఆర్ఎలుగా గుర్తించాలని తదితర న్యాయమైన డిమాండ్లు పరిష్కారించాలని కోరారు. సమస్యల పరిష్కార కోసం జూన్ 25న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నామని ఈ ధర్నాలో విఆర్ఎలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

టేబుల్ అజెండాలు వద్దు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో సోమవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఆకుల మల్లేశ్వరి అధ్యక్షత ఊహించగా, ఎజెండాలో పలు అంశాలపై చర్చించారు. అయితే కొన్ని అంశాలు టేబుల్ అజెండాలో పెడుతున్నారని, అంత అవసరం ఎందుకని కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు, కోడి విజయ్‌కుమార్, బాసర కాంతారావు తదితరులు కమిషనర్ రత్న రాజును ప్రశ్నించారు. అదేవిధంగా జెట్టివారి వీధిలో రహదారి పనులకు ప్రతిపాదనలు ఎజెండాలో పెట్టడంతో మిగిలిన వార్డుల్లో కూడా పనులకు ప్రతిపాదన చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పట్టణానికి తాగునీరిచ్చేలాచర్యలు చేపట్టాలని కాంగ్రెస్ నాయకుల కోరారు. ఈమేరకు సోమవారం సోమవారం డిఆర్ఒ కె.హేమలతకు కాంగ్రెస్ నాయకులు వి.దాలి నాయుడు, కోలా కిరణ్ కుమార్, తీళ్ళ గౌరీశంకరరావు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా మున్సిపాలిటీలో కుళాయిల్లో తాగునీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే రోగాల సీజన్ ఆరంభమైందని, మున్సిపాలిటీలో దోమల బెడద కూడా పెరిగిందన్నారు. తక్షణమే దోమల నివారణకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఏమాత్రం వర్షం పడ్డా పట్టణ మెయిన్ రోడ్డు చెరువును తలపిస్తోందన్నారు. దీనిపై తగు చర్యలు చేపట్టాలని కోరారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో అపారిశుధ్యం లేకుండా చూడాలని, అలాగే ఉరుములు మెరుపులు వచ్చినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని తెలిపారు. మంచినీటి ట్యాంకులను క్లీనింగ్లు చేసి బ్లీచింగ్ జల్లాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.కుమార్ వర్మ ,వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

రోడ్డు పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని శివారు గ్రామమైన దశమంతపురం-జియ్యమ్మవలస మండలం పెద్ద బుడ్డిడి గ్రామాల మధ్య సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో రోడ్డు పూర్తిగా కాకపోవడంతో ప్రజలు, రైతులు, చిరు వ్యాపారస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సోమవారం సిపిఎం నాయకులు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాకాడ ఇందిర మాట్లాడుతూ గతంలో శ్రీకాకుళం, విజయనగరం రెండు జిల్లాలకు చివరి గ్రామాలు కావడంతో ఏ విధమైన అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పాలకొండ, కురుపాం గత ఎమ్మెల్యేలు పట్టించుకోలేదని, ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడిందని, జిల్లా నుంచి ప్రతి పంచాయతీకి అందుబాటులో ఉన్న లింకు రోడ్లు కలిపి సమగ్రంగా అభివృద్ధి చేయాలని, కానీ అలా అభివృద్ధి కాలేదన్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఈ రెండు గ్రామాల జీవన రోడ్డును పూర్తి చేయకపోవడం చాలా అన్యాయం అన్నారు. రోడ్డు పూర్తయితే ప్రత్యక్షంగా 5000 మంది జనాభాకు, పరోక్షంగా 10,000 మంది జనాభాకు రవాణా సౌకర్యం ఏర్పడుతుందని, చుట్టుపక్కల ఉన్న రైతుల పండించే పంటలను రవాణా చేసుకోవచ్చని, గ్రామాల మధ్య రాకపోకలకు ఉపయోగంగా ఉంటుందని, బస్సు సౌకర్యం ఏర్పడి ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అలాగే జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం తదితర మండలాలకు ప్రయాణం సులభమవుతుందన్నారు. కావున రోడ్డు అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సిపిఎం నాయకులు ఎన్.సింహాచలం, నాగేశ్వరావు ఉన్నారు.

ఎమ్మెల్యే జయకృష్ణకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు ఇందిర

బురదలో నుంచి నడుచుకొని పాఠశాలకు వస్తున్న చిన్నారులు

పాఠశాలకు ఎలా వెళ్లాలి !

ప్రజాశక్తి- వీరఘట్టం

మండల కేంద్రంలోని మోడల్ ప్రైమరీ పాఠశాల (కూరాకుల వీధి)కు వెళ్లాలంటే బురద దాటేల్సిందేనని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలగ వీధి నుండి గాషి వీధి మీదుగా ప్రధాన రహదారికి వెళ్లే మార్గమైనప్పటికీ అధికారుల అలసత్వం వల్ల రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించుకోవడంతో చిన్నపాటి చినుకుపడ్డా రోడ్డు బురదమయంగా మారడంతో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు బురదలో నుంచి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మేజర్ పంచాయతీ పరిధిలోని కొన్ని వీధుల్లో ఈ ఏడాది మార్చిలో రూ 49.12 లక్షలతో సిసి రోడ్లు, కాలువలు నిర్మించారని, నిత్యము ఈ రహదారి గుండా వాహనరాక పోకలతో పాటు విద్యార్థులు, ప్రజలు, నిత్య ప్రయాణం సాగిస్తున్నారని, నలుగురికి ఉపయోగపడే రహదారిని అభివృద్ధి చేయకపోవడం దారుణమన్నారు. రహదారులు ఉన్నచోటే నిర్మించి చేతులు దులుపుకున్నారని అధికారుల తీరుపై స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బిల్లులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని రుక్మిణిగూడకు వేస్తున్న రోడ్డుకు తక్షణమే బిల్లలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. అధికారులు బిల్లులు మంజూరు చేయకపోవడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయని అన్నారు. పనులు మధ్యలో నిలిచిపోవడం వల్ల వర్షానికి రోడ్డు కొట్టుకుపోతుందన్నారు. దీంతో గ్రామస్తులు ఏకమై గోతులను కప్పుకుంటున్నారని తెలిపారు. కావున అధికారులు స్పందించి బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ఆయన కోరారు.

కుమారుడ్ని పాఠశాలలో చేర్పించడానికి వచ్చి తండ్రి మృత్యువాత

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని రాయిగుడ్డివలసకు చెందిన గిరిజన రైతు చెదల కన్నయ్య (45) తన కుమారుడ్ని పాఠశాలలో చేర్పించడానికి వచ్చి సోమవారం మృత్యువాత పడ్డాడు. గ్రామస్తులు, పాఠశాల హెచ్ఎం బి.శ్రీరామ్మూర్తి అందించిన వివరాలిలా ఉన్నాయి. చెదల గౌతం పద్మాపురం బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. తన కుమారుడికి పి.కోనవలస గురుకుల పాఠశాలలో 5వ తరగతి సీటు వచ్చిందని ఈనెల 13న కుమారుడు తండ్రి కన్నయ్య టిసి ఇవ్వాలని కోరడంతో టిసి ఇచ్చామని, అందులో మార్పులు ఉండడంతో సవరించుకునేందుకు సోమవారం పాఠశాలకు వచ్చి మాట్లాడుతుండగా కన్నయ్యకు ఫిట్స్ వచ్చిందని హెచ్ఎం తెలిపారు. వెంటనే వైద్యం కొరకు ఆటోలో స్థానిక పిహెచ్‌సి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యాధికారి జి.వెంకట్రావు నిర్ధారించాడని హెచ్ఎం తెలిపారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

యోగేంద్ర సమీక్షకు విశాఖపట్నం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును సోమవారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి వివరించినట్లు, అలాగే అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు గురించి సిఎంకు వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వీరఘట్టంలో 'అంగన్వాడీ పిలుస్తోంది'

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలో సిడిపిఒ రంగలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ రంగలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి తమవంతు కృషి చేయాలని తల్లిదండ్రులను కోరారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జ్ఞానమ్మ, రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.